క్లుప్తంగా

వర్షం కోసం..



అమ్మవారికి బోనాలు తీసుకెళ్తున్న గ్రామస్తులు

సి.బెళగల్: మండల పరిధిలోని చింతమాను పల్లె గ్రామస్తులు వర్షం కోసం మంగళవారం సప్పలమ్మ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. గ్రామ దేవత సప్పలమ్మకు బోనాలు సమర్పించి వర్షం కురవాలని వేడుకున్నారు. గ్రామం నుంచి మహిళలు బోనాలతో సి.బెళగల్ దారిలో ఉన్న అమ్మవారి ఆలయానికి ఊరిగేంపుగా వెళ్లారు. అక్కడ తీపి, పిండి వంటలతోపాటు బోనాలు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ఆవరణంలోనే భోజనాలు ఆరగించి, బోనాలను అక్కడే వదిలి ఇళ్లకు చేరుకున్నారు.

పరామర్శ



షాలుమియా కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న తహసీల్దార్ వెంకటలక్ష్మి

సి.బెళగల్: అనారోగ్యంతో మృతిచెందిన తహసీల్దార్ కార్యాలయ సబార్డినేట్ షాలుమియా కుటుంబ సభ్యులను తహసీల్దార్ వెంకటలక్ష్మి మంగళవారం పరామర్శించారు. డీటీ పురుషోత్తం, ఆర్ఐ తరుణ్ తదితరులు గూడూరుకు వెళ్లి షాలుమియా మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యలను పరామర్శించి, ధైర్యం చెప్పారు. అంత్యక్రియల ఖర్చుల నిమిత్తం రూ.25 వేల నగదును అందజేశారు.

సమస్యలు లేకుండా చూడాలి

సి.బెళగల్: విద్యార్థులకు సమస్యలు లేకుండా చూడాలని కమ్యూనిటీ మొబులైజేషన్ అధికారి (సీఎంఓ) ధన్‌రాజ్ సూచించారు. మంగళవారం ఆయన ఎంఈఓలు జ్యోతి, ఆదామ్‌బాషాలతో కలిసి కేజీబీవీ, మోడల్ స్కూళ్లను సందర్శించారు. ఆయా పాఠశాల పరిసరాలను, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పాఠశాలను సందర్శించిన డీపీఓ

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలుర పాఠశాలను నంద్యాల డీపీఓ లలితబాయి సందర్శించారు. మంగళవారం పాఠశాలలో పారిశుధ్యం, ఇతర సమస్యలపై ఆరా తీశారు. అనంతరం విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చేపట్టాల్సి పనులపై విచారించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మంత్రాలయం రూరల్ : మండల పరిధిలోని చిలకలడోణ గ్రామానికి చెందిన బోయ మహానంది(46) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ్డాడు. సోమవారం రాత్రి హాలహర్వి- చిలకలడోణ గ్రామాల మధ్య 167వ జాతీయ రహదారిలో కారు బైకును ఢీకొనడంతో బోయ మహానంది తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు అంబులెన్స్‌లో ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృత్యువాత పడ్డాడు.

వ్యక్తి ఆత్మహత్య

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులు (50) అనే వ్యక్తి కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు సీఐ విజయభాస్కర్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు గంజిహళ్లి గ్రామానికి చెందిన బోయ నరసింహులుకు భార్య మీనాక్షి, ముగ్గురు కుమారులు ఉన్నారు. వీరు గ్రామంలో వ్యవసాయ పనులతో పాటు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే నరసింహులు కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. చికిత్స చేయించుకున్నా నయంకాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం ఇంట్లో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యు లు నరసింహులును చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రెండో బెటాలియన్ పూర్వ కమాండెంట్ మృతి

కర్నూలు: ఏపీఎస్పీ కర్నూలు రెండో బెటాలియన్ పూర్వపు కమాండెంట్ రవిశంకర్ (63) అనారోగ్యంతో హైదరాబాదులోని ఏజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందారు. ఈయన 2020 సెప్టెంబర్ 1 నుంచి 2024 జనవరి 31 వరకు కర్నూలు బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేసి కడప బెటాలియన్‌కు బదిలీ అయ్యారు. పదవీ విరమణకు రెండు నెలల ముందు తిరిగి కర్నూలుకు బదిలీపై వచ్చారు. ఆగస్టు, సెప్టెంబర్ రెండు మాసాల పాటు కమాండెంట్‌గా పనిచేసి పదవీ విరమణ పొందారు. కొంతకాలం క్రితం అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాదు ఆసుపత్రిలో చేర్పించగా కోలుకోలేక మృతిచెందారు. ఆయన మృతికి అధికారులు సంతాపం ప్రకటించారు.

ధీమా ఇవ్వని చంద్రన్న బీమా!

- ఏడాది గడిచిన దరఖాస్తులు స్వీకరించని కూటమి ప్రభుత్వం
- గత ప్రభుత్వంలో వైఎస్సార్ బీమాతో పేదలకు ఎంతో మేలు

కుటుంబ పెద్ద అకాల మరణం చెందితే ఇంటిల్లిపాది రోడ్డున పడాల్సిందే. అలాంటి సమయంలో అండగా నిలుస్తున్న వైఎస్సార్‌బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం నీరుగార్చింది. చంద్రన్న బీమా పేరు మార్చడం తప్ప అమలు చేసింది లేదు. అధికారంలోకి వచ్చి ఏడాదైనా కనీసం దరఖాస్తులు కూడా స్వీకరించకపోవడంతో అభాగ్యులకు చంద్రన్న బీమా పథకం ధీమా ఇవ్వలేకపోతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కల్లూరు: గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు మోసపూరిత హామీలిచ్చి ప్రజలతో ఓట్లు వేయించుకున్నారు. అధికారం చేపట్టిన తర్వాత వాటిని అమలు చేయకుండా గాలికొదిలేశారు. సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. అకాల మరణం చెందిన వారి కుటుంబాలకు ఇస్తామన్న చంద్రన్న బీమా హామీని కూడా అమలు చేయకవడంతో ఆయా బాధిత కుటుంబాల కన్నీరే కూటమి ప్రభుత్వాన్ని మౌనంగా ప్రశ్నిస్తోంది.

మభ్యపెట్టి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకాన్ని చంద్రన్న బీమాగా పేరు మార్చారు. సహజ మరణానికి రూ.5 లక్షలు, ప్రమాదవశాత్తూ మృతి చెందితే రూ.10 లక్షలు అందచేస్తామని ఎన్నికల ప్రచారంలో ప్రజలను మభ్యపెట్టారు. అధికారం చేపట్టి తర్వాత అతీగతీ లేదు. ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో గ్రామాలకు వెళ్తున్న కూటమి నేతలకు ప్రజల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

వెబ్‌సైట్‌ను తొలగించి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్సార్ బీమా పథకానికి సంబంధించిన వెబ్‌సైట్‌ను తొలగించింది. అప్పటి నుంచి చంద్రన్న బీమా పథకంగా పేరు మార్చిన వెబ్‌సైట్‌లో మృతి చెందిన కుటుంబాల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలను కూడా విడుదల చేయలేదు. బీమా దరఖాస్తులు స్వీకరించేందుకు ఆదేశాలు రాలేదని సచివాలయ ఉద్యోగులు చెబుతున్నారు. కుటుంబ యజమానులు, సభ్యులు కోల్పోయిన బాధితులు బీమా ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గత వైఎస్సార్‌సీపీ హయాంలో పేద బడుగు, బలహీన వర్గాల కుటుంబాల్లో 18 నుంచి 50 ఏళ్లలోపు వారు, 50 నుంచి 60 ఏళ్లలోపు వారు మృతిచెందితే రూ.లక్ష నుంచి రూ.ఐదు లక్షల వరకు బీమా సొమ్ము మంజూరయ్యేది. మృతి చెందిన వెంటనే వలంటీర్లు, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది మృతుడి ఇంటికి వెళ్లి అంత్యక్రియల కోసం తక్షణ సాయంగా రూ.10 వేలు అందించేవారు. మిగతా సొమ్ము 15 నుంచి 20 రోజుల్లో నామిని బ్యాంకు ఖాతాల్లో జమ అయ్యేది. ఈ బీమా ప్రీమియాన్ని కూడా ప్రభుత్వమే చెల్లించేది. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చంద్రన్న బీమా పథకాన్ని అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బీమా మంజూరు చేయాలి



ఇంట్లో కుటుంబ సభ్యుడు, యజమానుని కోల్పోయిన మృతుల కుంటుంబాలకు ఇచ్చిన హామీ మేరకు బీమా సొమ్మును మంజూరు చేయాలి. పలు కుటుంబాలు యజమానిని, కుటుంబ సభ్యులను కోల్పోయి ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాయి. అలాంటి కుటుంబాలకు ప్రభుత్వం బీమా సొమ్ము అందజేసి అండగా నిలవాలి.

– అబ్దుల్ షుకుర్, దొడ్డిపాడు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం



ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. ప్రమాదవశాత్తూ మృతిచెందిన బాధిత కుటుంబాలు బీమా సొమ్ము కోసం ఎదుచూస్తున్నారు. కూటమి పార్టీ నాయకులు సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేశారు.

– కె.పెద్దఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఆర్గనైజర్, కర్నూలు

సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు



రామాపురం సమీపంలోని అరటితోటను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్

కోడుమూరు రూరల్: పదెకరాల్లోపు రైతులందరికీ 90 శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలను అందజేస్తున్నట్లు ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. మంగళవారం రామాపురం, లద్దగిరి, ప్యాలకుర్తి గ్రామాల పరిధిలోని పొలాల్లో కోడుమూరు హార్టికల్చర్ ఆఫీసర్ మదన్‌మోహన్ కలిసి ఏపీడీ ఫిరోజ్‌ఖాన్ పర్యటించారు. అరటి, దానిమ్మ, మిరపతోటలను, వాటికి డ్రిప్పు ద్వారా నీటిని అందిస్తున్న విధానాన్ని పరిశీలించారు. డ్రిప్పు ద్వారా మొక్కలకు ఎరువును పంపే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఐదెకరాల్లోపు ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై డ్రిప్పు పరికరాలు ఇస్తామని, సద్వినియోగం చేసుకోవాలని ఏపీడీ సూచించారు.

తప్పిపోయిన బాలుడు

- పోలీసుల ద్వారా కుటుంబ సభ్యుల చెంతకు..



బాలుడితో ఎస్ఐ నాగార్జున రెడ్డి

గడివేముల: అవ్వను చూసేందుకని బస్సు ఎక్కిన బాలుడు ముందు స్టేజీలోనే దిగడంతో కంగారు పడ్డాడు. దిక్కుతోచని స్థితిలో ఏడుస్తూ ఉండటంతో స్థానికులు గమనించి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. వారు వివరాలు ఆరా తీసి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి తెలిపిన వివరాలు.. నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమారుడు రమేష్ 7వ తరగతి చదువుతున్నాడు. సోమవారం నాగుల చవితి కావడం, పాఠశాలకు సెలవు ఉండటంతో కుటుంబ సభ్యుల అనుమతితో రమేష్ అవ్వను చూసేందుకని గడివేముల మండలం గ్రంధివేములకు బయలుదేరాడు. దామగట్ల నుంచి ఆటోలో నందికొట్కూరుకు చేరుకున్నాడు. అక్కడ నంద్యాల బస్సు ఎక్కి గ్రంధివేములకు టికెట్ తీసుకున్నాడు. అయితే మార్గమధ్యలో గడివేముల స్టేజీలో దిగాడు. తాను ఏ ఊరిలో ఉన్నానో తెలియక భయంతో ఏడ్చుకుంటూ బస్టాండ్‌లోనే కూర్చుని ఉండగా స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి బాలుడిని స్టేషన్‌కు తీసుకెళ్లి వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులను పిలిపించి వారికి అప్పగించారు.

పంటలకు బీమా చేయించుకోవాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ రూఫస్ రొనాల్డ్

కోడుమూరు రూరల్: సాగు చేసిన పంటలకు బీమా చేయించుకోవాలని ఏడీఏ సాలురెడ్డి సూచించారు. మంగళవారం ప్యాలకుర్తి గ్రామంలో ఏఓ రవిప్రకాష్ రైతులతో కలిసి పత్తి, కంది పంటల సాగుపై ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఈనెల 31లోపు పత్తి, వేరుశనగ, కంది, సజ్జ, కొర్ర పంటలకు బీమా చేయించుకోవాలన్నారు. పత్తిలో పచ్చ, తెల్ల దోమ నివారణకు జిగురు అట్టలు, గులాబీరంగు పురుగు నివారణకు లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలని రైతులకు సూచించారు.

గూడూరులో..

గూడూరు మండలం జూలకల్, పొన్నకల్ గ్రామాల్లో ఏఓ దస్తగిరి రెడ్డి మంగళవారం ×పొలం పిలుస్తోంది× కార్యక్రమం నిర్వహించారు. పత్తి పంటకు సోకే తెగుళ్లు, గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ వివరించారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కర్నూలు(రూరల్): పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయ అధికారి రూఫస్‌రొనాల్డ్ రైతులకు సూచించారు. మంగళవారం కర్నూలు మండల పరిధిలోని ఉల్చాల, బసాపురం గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలిచ్చారు. అలాగే ఈనెల 31లోపు పంటలకు బీమా చేయించుకోవాలని సూచించారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

ఎల్లమ్మా.. దీవించు తల్లీ!

కర్నూలు(రూరల్): నగర శివారులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మ అమ్మవారిని మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. శ్రావణ మాసం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి కుంకుమ, పసుపు, కాయకర్పూరాలు సమర్పించి పూజలు నిర్వహించారు. పండ్లు, పిండి వంటలు, గుగ్గిల్లు, భక్ష్యాలు నైవేద్యంగా సమర్పించారు.

సమస్యలతో విద్యార్థుల సహజీవనం



విద్యార్థులతో మాట్లాడుతున్న మణిరెడ్డి

పాణ్యం: వసతి గృహాలు, రెసిడెన్సియల్ పాఠశాలల్లో సరైన వసతులు లేక విద్యార్థులు, సిబ్బంది సమస్యలతో సహజీవనం సాగిస్తున్నారని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు జి.మణిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల బాలుర పాఠశాలను తనిఖీ చేశారు. భోజనం, మౌలిక వసతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ 228 మంది విద్యార్థులకు రెండు మరుగుదొడ్లు ఎలా సరిపోతాయన్నారు.

10 మందికి సరిపోయే గదిలో 30 మంది విద్యార్థులను ఉంచడం తగదన్నారు. పాఠశాలకు సరైన వసతులు లేవని, విద్యార్థులకు భోజనం వండేందుకు సిబ్బంది లేరని, రేకుల షెడ్‌లోనే వంట తయారు చేస్తున్నారని అన్నారు. మరుగుదొడ్ల సమస్యలతో విద్యార్థులు నరకయాతన అనుభవిస్తున్నారన్నారు. ఇటీవల పాఠశాలలో ఫుడ్ పాయిజన్ ఘటన జరిగినప్పటి నుంచి మాత్రమే భోజనాలు కాస్త నాణ్యతగా పెడుతున్నట్లు విద్యార్థులు చెప్పారన్నారు. ప్రభుత్వం అందించిన నాసిరకం స్కూల్‌బ్యాగ్‌లు చిరిగిపోయాయన్నారు. సమస్యలను మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సాయంత్రం విద్యార్థులకు వడ్డించిన ఆహారాన్ని పరిశీలించారు. ప్రిన్సిపాల్ క్రిష్టా నాయక్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ వింగ్ కర్నూలు జిల్లా నాయకులు బి.మధుమోహన్, సెక్రటరీ మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలి

కోడుమూరు రూరల్: మండలంలోని పులకుర్తి, కల్లపరి, ఖైన్‌దొడి గ్రామాల విద్యార్థులకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి కోరారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు తహసీల్దార్ నాగరాజును కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు వీరేంద్ర, అల్తాఫ్‌బాషా, మునిస్వామి, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పీఎంశ్రీకి ఎంపిక కావడం అభినందనీయం

ఓర్వకల్లు: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో ఓర్వకల్లు మోడల్ స్కూల్ ఉత్తమ పీఎంశ్రీ పథకం కింద ఎంపిక కావడం అభినందనీయమని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ అన్నారు. ఉత్తమ పీఎంశ్రీ పథకానికి ఎంపికైన సందర్భంగా మంగళవారం స్థానిక మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఎమ్మెల్యే గౌరు చరితతో కలిసి డీఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ పాఠశాలకు అదనపు గదులు, క్రీడా మైదానం, బాత్‌రూమ్‌లు, మరుగు దొడ్లు, మౌలిక సదుపాయాలను కేంద్ర ప్రభుత్వమే సమకూర్చుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జోషిలా వాట్, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ విద్యాసాగర్, ఎంఈఓలు ఓంకార్ యాదవ్, శ్రీధర్‌బాబు, ఏఎంఓ రఫి పాల్గొన్నారు.

కమిషనర్ ఆదేశాలు బేఖాతర్

- మున్సిపల్ దుకాణాలు, అద్దెల వివరాలు ఇవ్వని రెవెన్యూ సిబ్బంది
- మెమోలు జారీ చేసిన రెవెన్యూ అధికారి జునీద్

కర్నూలు (టౌన్): స్వయాన నగరపాలక కమిషనర్ పలుమార్లు రెవెన్యూ సిబ్బందిని ఆ విభాగానికి సంబంధించిన వివరాలు కావాలని కోరారు. నగరంలో మున్సిపల్ దుకాణాల వివరాలు, అద్దెల వివరాలు, వసూళ్లు, బకాయిల వివరాలు అడిగినా రెవెన్యూ సిబ్బంది ఇవ్వకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఎన్నిసార్లు గుర్తు చేసినా కమిషనర్ ఆదేశాలు సైతం బేఖాతరు చేశారు. దీనిపై సీరియస్ అయిన కమిషనర్ వారందరికీ మెమోలు జారీ చేయాలని ఆదేశాలిచ్చారు. ఈ మేరకు రెవెన్యూ అధికారి జునీద్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు మెమోలు జారీ చేశారు. రెవెన్యూ విభాగంలోని జి.సోహెయిల్ అహమ్మద్ (సీనియర్ అసిస్టెంట్), రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు టి.శ్రీనివాసులు, ఎస్.తిప్పన్న, ఎం.రాజు, ఎస్.మన్సూర్ బాషా, పి.భార్గవ్, శివ శంకర్‌కు నోటీసులు జారీ చేశారు. నిర్ణీత గడువులోపు లిఖిత పూర్వకంగా వివరణ ఇవ్వకుంటే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ స్టాండింగ్ కమిటీ ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ మంగళవారం ముగిసింది. ఐదు మంది ఎన్నికకు సంబంధించి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. తాజాగా ఇద్దరు కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత రెడ్డి, షాషా వలీ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. బరిలో ఐదుగురు మాత్రమే నిలిచారు. అధికార తెలుగుదేశం పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఈ ఎన్నికల్లో పోటీ చేయలేదు. దీంతో బరిలో ఉన్న వెంకటేశ్వర్లు, మునెమ్మ, సాంబశివరావు, నారాయణ రెడ్డి, షేక్ అహ్మద్ ఎన్నికలు నిర్వహించకుండానే దాదాపు ఏకగ్రీవమయ్యారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 1న నగరపాలక సంస్థలో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు ఏకగ్రీవంగా గెలుపొందడంతో వారికి నియమాక పత్రాలు అందజేయనున్నారు.

రహదారి.. అధ్వానం!

కర్నూలు(రూరల్): మండలంలోని సుంకేసుల ప్రధాన రహదారి నుంచి తులాశపురం గ్రామం వెళ్లే రెండు కిలోమీటర్ల రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిపై పలుచోట్ల కంకర తేలి గోతులమయంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రోడ్లు అద్దాల్లా మారుస్తామని ఎన్నికల సమయంలో హామీలిచ్చిన నాయకులు ఇప్పుడు అటువైపు తొంగిచూడకపోవడంతో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అద్దంలా కాదుకదా.. కనీసం మరమ్మతులైనా చేపట్టకపోవడంతో ప్రజలు శాపనార్థాలు పెడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయించాలని పలువురు కోరుతున్నారు.



తులశాపురం గ్రామం రోడ్డుపై కంకర లేచిన దృశ్యం



స్కాలర్ షిప్‌ల పంపిణీ



విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేస్తున్న డీఎస్పీ మంద జావలి

గడివేముల: మండల పరిధిలోని జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లను పంపిణీ చేయడం అభినందనీయమని నంద్యాల డీఎస్పీ మంద జావళి అన్నారు. మంగళవారం సిమెంట్ ఫ్యాక్టరీలోని ఆడిటోరియంలో 126 మంది విద్యార్థులకు రూ.20,02,957 చెక్కులను డీఎస్పీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఏటా ఆర్థికంగా వెనకబడిన విద్యార్థుల చదువులకు జిందాల్ యాజమాన్యం ప్రోత్సహించడం సంతోషకమరన్నారు. బాగా చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్లాంట్ హెడ్‌లు నవనీత్ చౌహన్, సాజిద్ గంగాధర్, సంజయ్ శర్మ, హెచ్‌ఆర్ మేనేజర్ కుమార్ వినీత్, సీఎస్ఆర్ మేనేజర్ రవికుమార్ పాల్గొన్నారు.

పంట బీమా చేసుకోండి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: సాగు చేసిన పంటలకు ఈనెలాఖరులోగా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మల్లేష్‌కుమార్ రైతులకు సూచించారు. మంగళవారం ఆయన మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో వ్యవసాయ సిబ్బందితో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. పత్తి, మిరప, ఉల్లి పంటలను పరిశీలించి, పంటల సస్యరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. అనంతరం స్థానిక రైతు సేవా కేంద్రంతో రైతులతో సమావేశమైన ఏఓ, ఖరీఫ్ సీజన్‌లో భాగంగా కంది, మిరప, ఉల్లి, వరి పంటలను సాగు చేసుకున్న రైతులు ఈనెల చివరి నాటికి ప్రీమియం చెల్లించి పంటల బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ సునీత, ఎంపీఈఓలు వెంకటేష్, ఈశ్వర్ పాల్గొన్నారు.

రమణీయం..శింగరయ్య రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

సి.బెళగల్: మండలంలోని పోలకల్ గ్రామంలో మంగళవారం సద్గురు శింగరయ్య స్వామి రథోత్సవం రమణీయంగా సాగింది. పీఠాధిపతులు రాజరత్నం శెట్టి ఇంటి నుంచి మొదలైన కుంబంకాగు ఊరేగింపుగా ఆలయానికి చేరుకుంది. హోమం అనంతరం స్వామి వారి ఉత్సవమూర్తిని రథంపై ఉంచి భక్తులు గోవిందనామ స్మరణతో రథాన్ని లాగారు. భక్తులు ప్రత్యేక పూజలతో పాటు మొక్కులు చెల్లించుకున్నారు. కాగా సి.బెళగల్‌లో కూడా శింగరయ్యస్వామి భక్తులు ఎద్దుల బండిపై స్వామి వారి చిత్రపటాన్ని ఊరేగించారు.

మండలంలో పంచమి వేడుకలు..

మండలంలో మంగళవారం నాగుల పంచమిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. పోలకల్ గ్రామంలోని స్వయంభూగా వెలసిన చెన్న సోమేశ్వరస్వామి ఆలయంలో పూజారులు స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆయా గ్రామాల్లో నూతన వధూవరులతో పాటు భక్తులు నాగుల కట్టల వద్ద, వ్యవసాయ పొలాల్లో ప్రతిష్టించుకున్న నాగదేవతల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు.



పూజలందుకున్న చెన్నసోమేశ్వర స్వామి

ఇద్దరు యువకుల దుర్మరణం





మృతిచెందిన శాంతిరాజు, శివ

కోడుమూరు రూరల్: కోడుమూరు–కర్నూలు రోడ్డులో నెరవాడ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు.. చనుగొండ్లకు చెందిన ఏబెల్ కుమారుడు శాంతిరాజు(20), యిర్మీయా కుమారుడు శివ(18) కర్నూలులో ఒకరు ఏసీ మెకానిక్, మరొకరు తాపీ మేస్త్రీగా పని చేస్తున్నారు. వారిద్దరూ కలిసి మంగళవారం రాత్రి కర్నూలు నుంచి బైక్‌పై స్వగ్రామం చనుగొండ్లకు బయలుదేరారు. మార్గమధ్యలో నెరవాడ వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. వాహనదారులు గమనించి చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా కోలుకోలేక యువకులిద్దరూ మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. కె.నాగలాపురం ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాగా చేతికొచ్చిన కుమారులను రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబలించడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు వర్ణనాతీతం.